క్లుప్తంగా

డీఎన్నార్‌ను కలిసిన నాయకులు


డీఎన్నార్‌ను కలిసిన గోరుముచ్చు గోపాల్ యాదవ్

కై కలూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను పార్టీ జిల్లా నాయకులు గోరుముచ్చు గోపాల యాదవ్, బీవీ రావు ఏలూరు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. డీఎన్నార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ పటిష్టతపై పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. వీరితో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లపై చలానా తనిఖీలు


వాహన తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రంగారావు, సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో మోటారు సైకిళ్లపై పాత చలానాలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టామని ట్రాఫిక్ ఎస్సై టీఎస్ రంగారావు తెలిపారు. డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలో మోటారు సైకిళ్ల చలానాలను తనిఖీ చేశారు. 13 కేసుల్లో రూ.3620 కట్టించామని రంగారావు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలకు చలానాలు వేస్తామని, వెంటనే చెల్లించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలపై చలానాలను చెల్లించాలని కోరారు.

బాలింత అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాదలోని బృందావన్ పార్కు సమీపంలో ఒక బాలింత అనుమానాస్పద మృతిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు బీసీ కాలనీకి చెందిన బావిశెట్టి భవాని (19) ఏలూరు పత్తేబాద బృందావన్ పార్కు ప్రాంతానికి చెందిన రేమల్లి క్రాంతికుమార్‌కు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వారికి మూడు నెలల క్రితం ఆడ శిశువు జన్మించింది. బాలింత భవాని శుక్రవారం ఉదయం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందింది. దీనిపై భవాని తల్లి నాగలక్ష్మి అనుమానం వ్యక్తం చేస్తూ ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇక ఖరీదే

- కూటమి ప్రభుత్వంలో మీటర్‌కు రూ.1800 వసూలు
- వైఎస్సార్ సీపీ హయాంలో ఉచితంగా కనెక్షన్
- ఒక్కో కుటుంబానికి రూ.5 వేల లబ్ధి

ఏలూరు రూరల్: ఎన్నికలకు ముందు పేదలను ధనవంతులను చేస్తానంటూ గొప్పలు చెప్పిన చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సంక్షేమ పథకాలకు మంగళం పాడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లకు అమలు చేసిన ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇప్పుడు ఎత్తేశారు. కాలనీల్లో పేదల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కావాలంటే రూ.1800 చెల్లించుకోవల్సిందేనని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇతర సామగ్రి కోసం మరో రూ.3,500 ఖర్చు చేయాల్సిందే. డబ్బులు కట్టిన వారికే మీటర్ బిగిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో పేదలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు నిలుపుదల

వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నియోజకవర్గంలో ప్రభుత్వం రూ.30 వేల ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. పోణంగిలో 7,035, కొమడవోలులో 9,954, లక్ష్మీపురంలో 7,017 అందించింది. 90 రోజుల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా మరో ఆరు వేల స్థలాలను పేదలు పొందారు. ఈ కాలనీల్లో ఇళ్లు కట్టుకున్న వారికి 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని నాటి జగన్ ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందు కోసం రూ.15 కోట్లు ఖర్చవుతుందని విద్యుత్ శాఖ అధికారులు లెక్కకట్టారు. దీంతో ప్రభుత్వం మొదట విడతగా విద్యుత్ శాఖకు రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడా మొత్తాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఉచిత కనెక్షన్ ఇచ్చేది లేదంటూ విద్యుత్ శాఖ చేతులెత్తేసింది.


కొమడవోలు జగనన్న కాలనీలో విద్యుత్ లైన్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)


లక్ష్మీపురం జగనన్న కాలనీలో ఇంటికి ఉచితంగా మీటర్ బిగిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఫ్రీ కనెక్షన్లు

వైఎస్సార్ సీపీ హయాంలో కాలనీల్లో ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికీ ఫ్రీగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. సుమారు రూ.3500 విలువైన సర్వీస్ వైర్, మీటర్, బోర్డు, ఎంసీపీ, ఎర్త్‌వైర్ సైతం బిగించారు. ఈ కనెక్షన్ వల్ల సొంతిల్లు కట్టుకున్న నాలుగు వేల మంది పేదలు ఒక్కో కుటుంబం రూ.5 వేలు చొప్పున మొత్తంగా రూ.2 కోట్ల లబ్ధి పొందారు. కోట్ల రూపాయలు వెచ్చించి కాలనీల్లో విద్యుత్ పనులు చేశారు.

ప్రభుత్వ నిర్ణయం పేదలకు నష్టం



వైఎస్సార్ సీపీ హయాంలో మాదిరిగానే పేదల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మేలు కోసం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయం. లబ్ధిదారులు మరో రూ.5 వేలు ఖర్చు చేసుకోవడం మరింత భారంగా మారుతుంది.

– కాటి దాసు, బూరాయిగూడెం, వెంకటాపురం

జగన్‌తోనే పేదలకు మేలు



పేదల సంతోషం కోసం జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం తపించేవారు. అందుకే పేదలకు మేలు చేసే పని కోసం ఎన్ని కోట్ల రూపాయలైనా ఖర్చు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లను నిలిపేయడం మంచిది కాదు. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లకు ఉచితంగా ఇస్తున్న కనెక్షన్లను కొనసాగించాలి.

– కాకి సాగర్, వెంకటాపురం

పరిపూర్ణమైన విద్యతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: నేడు విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని, క్రమశిక్షణతో జీవిస్తూ ఉన్నత భవితకు బాటలు వేసుకోవాలని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులతో పోలీస్ కల్యాణ మండపంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ చదివే పాఠ్యాంశాలపై పూర్తిస్థాయిలో విజ్ఞానాన్ని సాధించాలన్నారు. 40 శాతం మార్కులు సాధించినా.. అనేక మంది ఎంతో పరిజ్ఞానం కలిగి ఉంటారని తెలిపారు. విద్యార్థుల్లో సానుకూల దృక్పథంతోపాటు ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలన్నారు. 20 ఏళ్ల పాటు కష్టపడి, ఇష్టంగా చదివితే 60 ఏళ్లపాటు సుఖంగా జీవించే అవకాశం ఉందని అన్నారు. పరిపూర్ణమైన విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన తెలిపారు. తల్లిదండ్రులకు సమాజంలో గౌరవాన్ని తెచ్చేలా విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపాలి

ముంగర సంజీవ్ కుమార్



ఏలూరు రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిలో కనీసం 10 శాతమైనా చేసి చూపాలని వైఎస్సార్ సీపీ వడ్డిల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ముంగర సంజీవ్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఏలూరులోని వడ్డి కుల సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వడ్డి కులస్తులకు మత్స్యకార పింఛన్ అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీకి మళ్లీ పూర్వ వైభవం రానుందని, కార్యకర్తలకు అండగా ఉంటామని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని వివరించారు. వడ్డిలు అధికంగా ఉన్న కొల్లేరు గ్రామాల్లో జగన్ తన ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం రూ.380 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. రూ.20 కోట్లతో కైకలూరు, ఏలూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మించారని చెప్పారు. ప్రతి ఊరిలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాలు నిర్మించారన్నారు. 100 ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు అందించారని వివరించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్, కుళాయి, అందుబాటులోకి తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అయినప్పటికీ దెందులూరు నియోజకవర్గం కొల్లేరు గ్రామంలో ఒక్క అభివృద్ధి పని కూడా ప్రారంభం కాలేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు గట్టిగా జవాబు చెబుతామని హెచ్చరించారు.

సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న లింగరాజు

ఏలూరు (టూటౌన్): రవాణా రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం ఏలూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ మరింత బలపడాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది రవాణా రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణానికి సబ్సిడీ రుణాలను ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్ అధికారులు ఆటోలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను అవినీతికి తావులేకుండా కేటాయించాలని కోరారు. ఆటోలపై ఇ–చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సీహెచ్ అమర్ కుమార్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అమర్‌కుమార్ తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, నాయకులు సత్తా వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి చంద్ర శేఖర్, కోలా రాజా, ఎండీ చాన్ బాషా, అడ్డాల రాజు, మేరుగు వీర రాఘవులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతగా ర్యాగింగ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అనేది సామాజిక రుగ్మతగా మారిందని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై క్రాంతిప్రియ యాంటీ ర్యాగింగ్‌పై వైద్య విద్యార్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలకు కొత్తగా వచ్చే విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో బాధించటం సరైన విధానం కాదన్నారు. వారి మనోభావాలకు భంగం కలిగేలా మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తూ ర్యాగింగ్‌కు పాల్పడడం అత్యంత దారుణమని వివరించారు. ఏదైనా కేసుల్లో ఉంటే విద్యార్థుల ఉన్నత భవితకు తీవ్ర విఘాతంగా మారుతుందని హెచ్చరించారు. విదేశీ విద్య, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, విదేశాల్లో ఉద్యోగాలకు అటంకంగా మారతాయని తెలిపారు. కష్టపడి చదువుకుని ఉన్నత భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డిస్కౌంట్ ధరకు వస్తువులు వస్తాయనే ఆశతో డబ్బులు చెల్లించి మోసపోతున్నారని, దుకాణాల్లో వస్తువుల నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని అన్నారు. విద్యార్థులు కక్షతో మరొకరి ఫోన్ నెంబర్లు కాల్‌గర్ల్స్ వెబ్‌సైట్‌లో పెడుతున్నారని, బాధితుల్లో అత్యధిక శాతం యువతులే ఉన్నారని చెప్పారు. వ్యక్తిగత వివరాలను అపరిచిత వ్యక్తులకు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సదస్సులో ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం శశిధర్, ఫోరెన్సిక్ మెడిసిన్ హెడ్ కె.భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ, వైద్య విద్యార్థులు, ప్రొఫెసర్లు ఉన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న మహిళా ఉద్యోగి

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వమెడికల్ కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం రోజురోజుకు శృతిమించుతోంది. వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. శుక్రవారం మెడికల్ కళాశాల మహిళా ఉద్యోగి ఒకరు 1వ అంతస్తుకు లిఫ్ట్‌లోకి వెళ్లగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయానని బయటకు తీసుకురావాలంటూ సిబ్బందికి ఫోన్ చేసినా ఎలక్ట్రిషియన్, ప్లంబర్ ఎవరూ సకాలంలో స్పందించలేదని చెబుతున్నారు. జనరేటర్ వేయకుండా తాత్సారం చేయడంతో పాటు లిఫ్ట్ తాళాలు ఏలూరు జీజీహెచ్‌లో ఉన్నాయంటూ సుమారు అర్ధగంటకుపైగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం కళాశాల ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జనరేటర్ వేయడంతో లిఫ్ట్ నుంచి ఆమెను బయటకు తీసుకొచ్చారు. లిఫ్ట్‌లో గాలి ఆడకపోవడంతో ఆమె సొమ్మసిల్లి తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు తెలిసింది. సిబ్బంది పనితీరును కళాశాల ఉద్యోగులు తప్పుపడుతున్నారు.

ఫాదర్ ఆరోను సేవలు అభినందనీయం


ఆరోనును సత్కరిస్తున్న బాల, నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మైఖేల్ చర్చి ఫాదర్ ఆరోను చేస్తోన్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అభినందనీయమని నిర్మలగిరి అన్నదాన ట్రస్ట్ చైర్మన్ నాగేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం మైఖేల్ చర్చిలో ఫాదర్ ఆరోను జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరోను నిర్మలగిరి మేరీమాత ఆలయాన్ని అభివృద్ధి చేసి, గౌరీపట్నంలోని అనేకమంది విశ్వాసుల కోసం నిత్యాన్నదానంతోపాటు సేవా కార్యక్రమాల్లో ముందున్నారని నాగేశ్వరరావు తెలిపారు. పేదల కోసం హాస్పటల్స్, కాలేజీలు కట్టించి విద్య, వైద్య సేవ కార్యక్రమాలతో వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఫాదర్ ఆరోనుకు అనేక మంది గురువులు, ఫాదర్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వికార్ జనరల్ ఫాదర్ బాల, గౌరీపట్నం నిత్య అన్నదానం ట్రస్ట్ చైర్మన్ కళ్లే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో క్రిషితాబా జడేజా ప్రథమ, కె.నవ్యశ్రీ ద్వితీయ, పెయింటింగ్‌లో ఎస్ దుర్గ ద్వితీయ, సీహెచ్ గాయత్రి తృతీయ, జానపద నృత్యం సోలోలో బి.జాహ్నవి ప్రథమ, ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంలో బి.గణేష్ తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. క్రిషితాబా జడేజా, బి.జాహ్నవిలు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం తమ కళాశాలలో ప్రత్యేకంగా అభినందించామన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎస్ శేషారెడ్డి, కార్యదర్శి ఎస్ సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ ఫణి కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి


విద్యుత్ భవన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు రంగంలో అమలవుతున్న ట్రూ అఫ్, సర్దుబాటు, ఇందనపు చార్జీలు, అదనపు విద్యుత్ చార్జీలు రద్దు చేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక రామచంద్రరావు పేటలోని విద్యుత్ భవన్ వద్ద సీపీఎం కార్యకర్తలు ధర్నా చేశారు. కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఎండగడుతూ ధరలు పెంపుదలపై బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించిందని గుర్తు చేశారు. నేడు మరోసారి విద్యుత్తు చార్జీలను సర్దుబాటు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో విద్యుత్ సంస్థలు చార్జీలు పెంచుతూ ప్రతిపాదనలు పెట్టిందని ఆక్షేపించారు. ఈ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా నాయకులు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వైఎస్ కనకారావు, జి.శారద, కంది విశ్వనాథం, జి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యారవీ షరీఫ్


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా)లో శుక్రవారం గ్యారవీ షరీఫ్ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం జండా ఊరేగింపు నిర్వహించారు. దరూత్ సలాం, ఫాతెహాఖానీ, దువా ప్రార్థనలు చేశారు. రాత్రి 7 గంటల నుంచి సుమారు 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గొలుసుల పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ, ఎండీ సరూర్, ఎండీ ఇలియాస్ పాషా, ఎండీ అస్లాం పాషా, షేక్ సరోజ్ భాషా, షేక్ వలీ, ఎండీ అనీస్ పాషా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మరింత పెరగాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో రత్న ప్రసాద్ స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఫోర్ట్ మోడల్ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై శుక్రవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం, మంచినీటి సౌకర్యాలు పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. ఫోర్ట్ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రూపావతు రంగయ్య, ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో అగ్నిప్రమాదం

దెందులూరు: గోపన్నపాలెంలో గురువారం రాత్రి కొండేటి వెంకన్నకు చెందిన ప్రభ కిరాణా జనరల్ స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న గోపన్నపాలెం వీఆర్వో రంగనాథ్ ప్రమాదానికి గురైన కిరాణా షాప్‌కి వెళ్లి పరిశీలించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.15 లక్షలకు పైగా ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధమైందని తెలిపారు. నివేదికను దెందులూరు మండల తహసీల్దార్ బి. సుమతికి అందజేస్తానని ఆయన వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	19

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	13
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	16
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	12
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42-50	అరటి కాయ (1)	06,08,10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	56-88
వంకాయలు (కాంతులు)	40-56	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07,10
బెండకాయలు	28	కంద	60
పచ్చిమిర్చి	40-48	బీట్‌రూట్	40-48
కాకర కాయలు	34-40	కీరా దోస	36
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-150
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	48-56	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-54	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	34-44	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44